పారిశుద్ధ్య పనులను సక్రమంగా నిర్వహించాలి



కాళీమందిర్ వద్ద పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: పారిశుద్ధ్య పనులను సక్రమంగా నిర్వహించినప్పుడే ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగవని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర అన్నారు. గురువారం కాళీమందిర్ మెయిన్‌రోడ్డు, డాన్ బాస్కో స్కూల్, చేవెళ్ల రోడ్డుపై జరుగుతున్న పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... పారిశుద్ధ్య సిబ్బంది నిత్యం ఉదయాన్నే మొదట మెయిన్ రోడ్లను శుభ్రం చేయాలన్నారు. అనంతరం కాలనీలు, బస్తీలలో పారిశుద్ధ్య పనులను చేపట్టాలని స్పష్టం చేశారు. కార్మికులు శ్రద్ధగా పని చేస్తేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్మికులకు ఎలాంటి ఇబ్బందులు, సమస్యలు ఉన్నా తన దృష్టికి తేవాలన్నారు. ఆయా సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం



శంషాబాద్ ఎస్ఈఏ మిషన్ హై స్కూల్‌లో...



బాలల దినోత్సవంలో పాల్గొన్న వాసవి క్లబ్ సభ్యులు

మణికొండ: బాలల దినోత్సవాన్ని మణికొండ వాసవి క్లబ్ కపుల్స్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో కేక్ కట్ చేయించి స్వీట్లు, బుక్స్, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు వి.వంశీకృష్ణ మాట్లాడుతూ... నేటి బాలలే రేపటి పౌరులని, వారిని అన్ని రంగాలలో ఉత్తమంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులకు తమ వంతు సేవలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి టి.యశ్వంత్, కోశాధికారి శిరీష, జోన్ చైర్మన్ కె.నిరీష, రీజియన్ చైర్మన్ జి.నవీన్‌కుమార్, రీజియన్ కార్యదర్శి రామ్ సురేష్, జిల్లా ఇంచార్జి కిరణ్ కుమార్, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

శంషాబాద్...

శంషాబాద్: భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా పట్టణంలోని పాఠశాలల్లో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎస్ఈఏ మిషన్ హై స్కూల్‌లో సినీ నటుడు పసునూరి శ్రీనివాస్‌రావు పాల్గొని ప్రసంగించారు. అనంతరం విద్యార్థులకు బిస్కెట్లు, కేక్‌లను పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ ప్రియాంక రాయి, మోర్ట్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ అంబేకర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాజేంద్రనగర్ గ్రంథాలయంలో...

రాజేంద్రనగర్: జవహర్ లాల్ నెహ్రూ జయంతిని గురువారం రాజేంద్రనగర్ గ్రంథాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చాచాజీ సేవలను వక్తలు కొనియాడారు. పాఠకులు, వక్తలు దేశానికి నెహ్రూ చేసిన సేవలు దేశానికి గర్వ కారణమని.. ప్రజాస్వామ్య విలువలకు, దేశాభివృద్ధి ఎంతగానో సేవలు అందించారన్నారు. రక్షణ శాఖ విశ్రాంతి అధికారి బి.వి.రావు, ప్రభుత్వ ప్రధానోపాధ్యాయుడు నర్సింహులు, తేజస్విని, గ్యాస్ డైరెక్టర్ పి.రమేశ్, ఆశా వర్కర్ మీనా, గ్రంథాలయ అధికారి పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



రాజేంద్రనగర్ గ్రంథాలయంలో...

మార్కెట్‌ను అభివృద్ధి చేయండి



నరేందర్‌ను కలిసిన మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు

మణికొండ: నార్సింగి మార్కెట్ కమిటీని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి రైతులతో పాటు స్థానికులకు అన్ని రకాల సౌకర్యాలను కల్పించాలని మణికొండ మున్సిపల్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి కె.నరేందర్ ముదిరాజ్ అన్నారు. మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గ సభ్యులు చైర్మన్ కె.వేణుగౌడ్ ఆధ్వర్యంలో గురువారం ఆయనను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నార్సింగి, శంషాబాద్‌లలో మార్కెట్‌లలో పలు సౌకర్యాలను కల్పించటం, నిర్మాణాలను చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. వాటిని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధులను రాబట్టాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్‌లు పాల్గొన్నారు.

రోగులకు అత్యుత్తమ వైద్యసేవలందించాలి: ఎమ్మెల్యే

మణికొండ: రోగులకు అత్యుత్తమ సేవలు అందించేందుకు ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు కృషి చేయాలని, అలాగే రోగుల పట్ల సేవాధృక్పథంతోనూ వ్యవహరించి చికిత్సలందించాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ సూచించారు. మణికొండ పరిధిలోని అల్కాపురి టౌన్‌షిప్ రోడ్ నెం.8లో ఆయన గురువారం శ్రీరామ్ క్లినిక్ (పీడియాట్రిక్స్)ను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ మణికొండలో శ్రీరామ్ ఆస్పత్రి అందుబాటులోకి రావడం ద్వారా స్థానికులకు మంచి వైద్యసేవలు అందుతాయన్నారు. ఆస్పత్రి నిర్వాహకులు డాక్టర్ శ్రీనివాస్ బోగ, డాక్టర్ ఉమామహేశ్వరి మాట్లాడుతూ రాజేంద్రనగర్ పరిధిలోని ప్రజలకు అత్యుత్తమ వైద్యసేవలందించేందుకే తాము ఈ క్లినిక్‌ను ప్రారంభించామన్నారు. తమ ఆస్పత్రిలో అత్యాధునిక వసతులున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మణికొండ మున్సిపల్ చైర్మన్ కస్తూరి నరేందర్, ముదిరాజ్ కో ఆపరేటివ్ సొసైటీ కార్పొరేషన్ చైర్మన్ బి.జ్ఞానేశ్వర్, నార్సింగి మున్సిపల్ చైర్మన్ నాగపూర్ణిమ శ్రీనివాస్, టీపీసీసీ అధికారప్రతినిధి జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సర్వేకు ప్రజలు సహకరించాలి

బండ్లగూడ: సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలంతా సహకరించాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర సూచించారు. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే కార్యక్రమంలో భాగంగా సమగ్ర సర్వే ప్రక్రియను గురువారం ఆయన పరిశీలించారు. కార్పొరేషన్ పరిధిలోని 5వ డివిజన్ సాయిరాంనగర్, 14వ డివిజన్ గిరిధారి, 16వ డివిజన్ లక్ష్మీనగర్ కాలనీలలో పరిశీలించారు. ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వెళ్లి పూర్తి వివరాలను సేకరించాలన్నారు. ఆయా వివరాలు రానున్న రోజుల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలకు ఉపయోగపడతాయన్నారు.

జీహెచ్ఎంసీ ఎస్టేట్ ఆఫీసర్ పరిశీలన...

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని అత్తాపూర్, రాజేంద్రనగర్ డివిజన్లలో వివిధ ప్రాంతాల్లో కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వేను జీహెచ్ఎంసీ ఎస్టేట్ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి గురువారం పరిశీలించారు. రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రవికుమార్, సూపర్‌వైజర్, ఎన్యూమరేటర్‌లతో కలిసి ఆయన కార్యక్రమ తీరుపై ఆరాతీశారు. ఎన్యూమరేట్ చేసిన ఫారమ్‌ల నాణ్యతను ధ్రువీకరించారు.

ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి గణేష్‌మాదిగ



సర్వేను పరిశీలిస్తున్న ఎస్టేట్ ఆఫీసర్ శ్రీనివాస్‌రెడ్డి

మణికొండ: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేలో మాదిగలు ఎస్సీ మాదిగ కోడ్ 31ను నమోదు చేయించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి, గండిపేట మండల ఇంచార్జి గణేష్‌మాదిగ తెలిపారు. మాదిగల్లో అనేక ఉపకులాలు ఉన్నాయని, వాటిని నమోదు చేసే సమయంలో జాగ్రత్త పడాల్సిన అవసరం ఉందన్నారు. లేదంటే రాబోయే రోజుల్లో రిజర్వేషన్లు, ఉపాధి, సంక్షేమ పథకాలు పొందేందుకు ఇబ్బంది ఏర్పడుతుందన్నారు. మాదిగల జనాభాతో పాటు అన్ని పథకాలు అందాలంటే తప్పనిసరిగా మాదిగ కోడ్ 31ను ప్రతి మాదిగ నమోదు చేయించాలన్నారు. ఈ విషయాన్ని ఎమ్మార్పీఎస్ నాయకులు, దళిత నాయకులు ప్రజలకు వివరించాలన్నారు.

పేరు ఘనం.. వసతులు శూన్యం

- గోల్కొండ కోట వద్ద కనీస సౌకర్యాలు కరువు
- పర్యాటకుల అవస్థలు
- పార్కింగ్ సౌకర్యం లేక ట్రాఫిక్ సమస్యలు
- క్యాంటిన్ సదుపాయం లేక రోడ్డుపైనే భోజనాలు

గోల్కొండ: ప్రసిద్ధ పర్యాటక ప్రాంతమైన గోల్కొండ కోటకు నిత్యం దేశవిదేశాల నుంచి వేలాది మంది పర్యాటకులు వస్తుంటారు. దేశంలోనే ప్రముఖమైన కోటల్లో గోల్కొండ కోటకు ప్రత్యేక గుర్తింపు ఉంది. హైదరాబాద్‌కు వచ్చే టూరిస్టులు ఎవరైనా ముందుగా సందర్శించేది గోల్కొండ కోటకు మాత్రమే. 500 ఏళ్ల నాటి నిర్మాణ శైలికి గోల్కొండ కోట నిలువెత్తు నిదర్శనం. భారీ గోడలు, పటిష్టమైన ప్రహరీ, గోల్కొండ కోటకు ప్రత్యేక ఆకర్షణ. కోటలో క్లాపింగ్ పోర్టిపో శతాబ్దాల క్రితం నాటి సాంకేతిక పరిజ్ఞానానికి నిదర్శనం. కోటలోని ప్రవేశద్వారం, రాణీమహల్ ప్రాంగణం తదితర ప్రాంతాల్లోని భారీ ఫిరంగులను పర్యాటకులు కళ్లప్పగించి చూస్తారు. అంతేకాకుండా కుతుబ్ షాహీ రాజులు వాడిన వివిధ రకాల ఆయుధాలను కోటలోని ఆయుధాగారంలో ప్రదర్శనకు ఉంచారు. అక్కన్నమాదన్న కార్యాలయం, భక్త రామదాసును బంధించిన చెరసాల, కోటకు అదనపు ఆకర్షణగా నిలుస్తున్నాయి. అయితే ఇవన్నీ తిలకించడానికి పర్యాటకులకు కనీసం నాలుగు గంటల సమయం పడుతుంది. కోటలో కేంద్ర పురాతత్వ శాఖ ఏర్పాటు చేసిన క్యాంటిన్‌లో వాటర్ బాటిళ్లు, ఐస్‌క్రీం తప్ప ఇంకేమి లభించవు. దీంతో అలసిపోయిన పర్యాటకులు భోజనం కోసం మెహిదీపట్నం, అబిడ్స్, మాసబ్‌ట్యాంక్ తదితర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుంది. కోటలో పర్యాటకులకు నీళ్ల బాటిళ్లు, ఆహార పదార్థాలను తీసుకెళ్లేందుకు అనుమతి లేదు. కోట బయట ఉన్న ఒకే ఒక్క రెస్టారెంట్ నాన్ వెజ్ పదార్థాలను మాత్రమే అందుబాటులో ఉండటంతో వెజిటేరియన్‌లు భోజనం దొరక్క ఇబ్బందులు పడుతున్నారు.



విద్యుత్ దీపాల వెలుగులో గోల్కొండ కోట



కోట ముందు రోడ్డు పక్కన భోజనం చేస్తున్న పర్యాటకులు

పార్కింగ్ లేక అవస్థలు..

మరో వైపు ఇతర ప్రాంతాలు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వారు ఎక్కువగా టూరిస్టు బస్సులు, కార్లల్లోనే వస్తుంటారు. ప్రతినిత్యం కోటకు సుమారు 250–350 వరకు కార్లు వస్తుంటాయి. అదే విధంగా పదుల సంఖ్యలో టూరిస్టు బస్సులు కూడా వస్తుంటాయి. అయితే కోట అధికారులు మాత్రం వీరికి పార్కింగ్ సౌకర్యం కల్పించకపోవడంతో పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు. పర్యాటకుల వాహనాలకు పార్కింగ్ ప్రదేశం కేటాయించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అదే విధంగా కోటలో నాణ్యమైన భోజనం అందించేందుకు క్యాంటిన్ ఏర్పాటు చేయాలని పర్యాటకులు కోరుతున్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

మణికొండ: ఆస్పత్రులు, సేవా సంస్థలు నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకుని వైద్యుల సలహాలను పాటించి ఆరోగ్యంగా ఉండాలని మణికొండ మున్సిపల్ చైర్మన్ కె. నరేందర్ ముదిరాజ్ అన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని అలకాపూర్ టౌన్‌షిప్ ఎంజీ పార్కులో అపోలో సుగర్ క్లినిక్స్ ఆధ్వర్యంలో ప్రపంచ మధుమేహ నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రస్తుతం మనం తీసుకుంటున్న ఆహారంలో సమతుల్యత లేనందునే పలు ఆరోగ్య సమస్యలు వస్తున్నాయన్నారు. వాటిని ఇలాంటి శిబిరాలలో ఉచితంగా పరీక్షలు నిర్వహించుకుని డాక్టర్‌ల సలహాలతో నయం చేసుకోవాలన్నారు. ప్రజలకు ఇలాంటి సేవలు అందిస్తే ఆసుపత్రులను వారు ఆదరిస్తారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వి.దీప్తి మన్నం, సిబ్బంది, పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

వైఫల్యాలను అధిగమిస్తేనే విజయం సాధ్యం

సినీ గేయ రచయిత చంద్రబోస్

మణికొండ: జీవితంలో అనేక వైఫల్యాలు వస్తాయని వాటికి భయపడకుండా మరో ప్రయత్నం చేసినపుడే విజయం వరిస్తుందని సినీ గేయ రచయిత, ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్ అన్నారు. గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ) కళాశాలలో గురువారం కమ్యూనికాండో, లిటరరీ క్లబ్ ఆఫ్ సీబీఐటీ ఆధ్వర్యంలో తన ఫ్లాగ్‌షిప్ ఈవెంట్ క్రెసెంటియా 3.0ను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరై చంద్రబోస్ మాట్లాడుతూ... జీవితంలో అన్నీ సునాయాసంగా దక్కవని, వాటిని తెలివి తేటలతో పోటీతత్వంతో పట్టుదలతో సాధించుకోవాల్సి ఉంటుందన్నారు. తాను రాసిన నాటు నాటు పాట తిరస్కరణ నుంచి ఆస్కార్ విజేతగా ఎలా నిలిపిందో వివరించారు. తెలుగు ప్రాముఖ్యత, సాంస్కృతిక వారసత్వం గురించి వివరించారు. క్లబ్ వ్యవస్థాపకురాలు స్వాతి ఉపాధ్యాయ్ మాట్లాడుతూ... జీవితంలో మన ప్రయాణాన్ని మనమే ఏర్పాటు చేసుకుని తీరాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో హితం, వర్దమాన్, సెయింట్ ఫ్రాన్సిస్, డెక్కన్ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

నడుస్తున్న కారులో మంటలు

మణికొండ: కొత్తగా కారు కొనుక్కొని కుటుంబంతో కలిసి శుభకార్యానికి వెళ్తుండగా..దాని ఇంజన్‌లో ఒక్కసారిగా మంటలు రావటంతో భయాందోళనకు గురయ్యారు. నరేందర్ అనే వ్యక్తి కొత్తగా కొన్న కారులో కుటుంబ సభ్యులతో కలిసి గచ్చిబౌలి నుంచి శంషాబాద్ వైపు వెళ్తుండగా..మంచిరేవుల వద్దకు రాగానే ఇంజన్‌లో నుంచి ఒక్కసారిగా పొగ వచ్చింది. దాన్ని గమనించి వెంటనే కారును పక్కన నిలిపి అందులోని వారంతా కిందకు దిగారు. బానెట్ తీసి చూస్తుండగా ఇంజన్‌లో మంటలు వచ్చాయి. అదే సమయంలో ఔటర్‌పై మొక్కలకు నీరు పోస్తున్న సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. దాంతో పెను ప్రమాదం తప్పింది. కారును 45 రోజుల క్రితమే కొనుగోలు చేశానని, మంటలు ఎందుకు వచ్చాయో అర్థం కాలేదని యజమాని తెలిపారు. తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని నార్సింగి పోలీసులు తెలిపారు.

కొనసాగుతున్న సమగ్ర ఇంటింటి సర్వే



మెదక్ ఎంపీ రఘునందన్‌రావు నుంచి వివరాలు నమోదు చేస్తున్న మున్సిపల్ అధికారులు

మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, సినీ నటుడు ఆర్యన్ రాజేష్ వివరాల నమోదు

మణికొండ: రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే) మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో కొనసాగుతున్నది. ఎన్యూమరేటర్‌లు ఇంటింటికీ వెళ్లి ప్రజల సమాచారాన్ని సేకరిస్తున్నారు. గురువారం మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులలో సర్వే కొనసాగింది. సర్వేలో భాగంగా సినీనటుడు ఆర్యన్ రాజేష్, మెదక్ ఎంపీ రఘునందన్‌రావు గృహాలకు వెళ్లి సమాచారం తీసుకున్నారు. ప్రజలు, ప్రముఖులు సర్వేకు సహకరిస్తున్నారని, సకాలంలోనే సర్వేను పూర్తి చేస్తామని మున్సిపల్ కమిషనర్ డి.ప్రదీప్‌కుమార్ తెలిపారు.



సినీనటుడు ఆర్యన్ రాజేష్ నుంచి...

‘ట్రాఫిక్’ ఉల్లంఘనులపై కొరడా



డ్రైవర్లకు సూచనలిస్తున్న ఇన్‌స్పెక్టర్ నరేందర్

- ట్రాఫిక్ నిబంధలనకు విరుద్ధంగా వాహనాలు నడిపేవారిపై కొరడా ఝుళిపించిన పోలీసులు
- సరైన పత్రాలు లేని 40 ఆటోల సీజ్
- మైనర్లుకు వాహనాలిస్తే చర్యలు తథ్యం

మైలార్‌దేవ్‌పల్లి: సరైన పత్రాలతో ఆటోలు నడపని డ్రైవర్లపై చట్టపరంగా చర్యలు తథ్యమని మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నరేందర్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌గౌడ్ హెచ్చరించారు. గురువారం మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కాటేదాన్ చౌరస్తాలో ఆటోలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో భాగంగా సరైన పత్రాలు లేని 40 ఆటోలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్‌లు మాట్లాడుతూ... వాహనాల యజమానులు మైనర్లకు తమ వాహనాలను ఇవ్వరాదన్నారు. మైనర్లు ఆటోలు నడపడం వలన ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. గతంలో మైనర్లు ఆటోలు నడిపి ప్రమాదాలు జరిగిన సంఘటనలు చాలా ఉన్నాయని గుర్తు చేశారు. ఎట్టిపరిస్థితులలో మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని ఆయన స్పష్టం చేశారు. రోడ్డుపై ఆటోలు సరైన పత్రాలతో నడపాలని, ట్రాఫిక్ రూల్స్ తప్పని సరిగా పాటించి వాహనదారులకు ఇబ్బందులు కలుగకుండా నడుపుకోవాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా ఆటోలను నడిపితే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులు పాల్గొన్నారు.

24న రెడ్డి సంఘం కార్తీక వనభోజనాలు

మణికొండ: కార్తీక మాసం సందర్భంగా ఈ నెల 24వ తేదీన పెద్ద ఎత్తున వనభోజనాలను నిర్వహించనున్నట్లు మణికొండ రెడ్డి ఫౌండేషన్ అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె. శ్రీకాంత్‌రెడ్డిలు తెలిపారు. గురువారం మణికొండ రెడ్డి సంఘం కార్యాలయంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గత సంవత్సరం నిర్వహించిన కార్తీక వనభోజనాలకు వేలాది మంది రెడ్డిలు ఉత్సాహంగా పాల్గొన్నారన్నారు. వారిలో ఐక్యత పెరిగిందని, ఈ సంవత్సరం అదే తరహాలో వనభోజనాలను నిర్వహించాలని నిర్ణయించామన్నారు. నార్సింగిలోని కేవీఎంఆర్ గార్డన్స్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఇందులో ఉంటాయన్నారు. నాయకులు శ్రీపతిరెడ్డి, రామ సుబ్బారెడ్డి, శరత్ రెడ్డి, రమణారెడ్డి, బాల్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఉత్తం కుమార్‌రెడ్డి, కృపాకర్‌రెడ్డి, కిషన్‌రెడ్డి, లవన్‌కుమార్‌రెడ్డి, సైదిరెడ్డి, శైలజారెడ్డి, ప్రియారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న రెడ్డి ఫౌండేషన్ నాయకులు

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ పరిసర ప్రాంతాల ప్రజల సౌకర్యార్థం శుక్రవారం డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు టీజీ ఆర్టీసీ రాజేంద్రనగర్ డిపో సూపరింటెండెంట్ ట్రాఫిక్ సుశీల తెలిపారు. రాజేంద్రనగర్ పరిసర ప్రాంతాల ప్రజలు తమ గ్రామాలకు సంబంధించిన సర్వీసులు, ఏవైనా సమస్యలు, సలహాలు, సూచనలు ఉంటే రాజేంద్రనగర్ డిపో సూపరింటెండెంట్ సుశీలను ఫోన్: 73828 18603లో సంప్రదించి ఫిర్యాదు చేయవచ్చునన్నారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఈ సదవకాశాన్ని ఆర్టీసీ ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అత్తాపూర్ అభివృద్ధే లక్ష్యం



అత్తాపూర్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అహర్నిశలు కృషి చేస్తున్నామని అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మోండ్ర సంగీతగౌరీశంకర్ అన్నారు. డివిజన్ పరిధిలోని పాండురంగానగర్ భానోదయ స్కూల్ సమీపంలో సీసీ రోడ్డు అభివృద్ధి పనులు ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... రూ. 22 లక్షల అంచనా వ్యయంతో ఈ పనులను చేపడుతున్నామన్నారు. సకాలంలో కాంట్రాక్టర్లకు బిల్లులు రాకపోవడంతో పనులు కొంచెం ఆలస్యం అయ్యాయని అన్నారు. పాండు రంగానగర్‌లో అభివృద్ధి లక్ష్యంగా దృష్టి సారిస్తున్నామన్నారు. ప్రజలకు ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే ఆయా సంబంధిత అధికారులతో చర్చించి దశలవారీగా పూర్తి చేయిస్తామని బస్తీ ప్రజలకు హామీ ఇచ్చారు. బీజేపీ జిల్లా కార్యదర్శి మోండ్ర కొమురయ్య, వనం శ్రీరామ్‌రెడ్డి, లక్కన్‌సింగ్, ముఖేష్, బీరధర్, విజయ్ రావత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ ఆలయ పునర్నిర్మాణానికి భూమి పూజ

అత్తాపూర్: అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడలోని శ్రీ పోచమ్మ దేవాలయ పునర్నిర్మాణానికి గురువారం ఘనంగా పూజలను ప్రారంభించారు. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. చరిత్రాత్మకమైన పోచమ్మ దేవాలయాన్ని అధునాతన పద్ధతిలో అభివృద్ధి చేయనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు సోమారం రాజ్‌కుమార్ వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రత్యేక హోమంతో పాటు వివిధ పూజలను చేపట్టారు. పూజల్లో సోమారం రవీందర్, బాలసుబ్రహ్మణ్యం, గోదెల చంద్రయ్య, బాలమురళీకృష్ణ, శ్రీకాంత్, శ్రీనివాస్, కొత్తూరు మల్లేష్, చిత్తారీ, భాస్కర్, పరిసర ప్రాంతాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



భూమి పూజ నిర్వహిస్తున్న దృశ్యం

ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి: ఏఐటీయూసీ

ఆరాంఘర్ చౌరస్తాలో ధర్నా



ధర్నా చేస్తున్న ఆటో యూనియన్.. ఏఐటీయూసీ సభ్యులు

మైలార్‌దేవ్‌పల్లి: ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అయ్యిందని ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి ఆరోపించారు. గురువారం రాజేంద్రనగర్ మండల పరిధిలోని ఆరాంఘర్ చౌరస్తాలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లతో ధర్నా నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం మహాలక్ష్మి పథకంతో ఆటో డ్రైవర్లకు గిరాకీ తగ్గి వారి కుటుంబాలను పోషించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. కాంగ్రెస్ పాలకులు ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలోని ప్రతి ఆటోడ్రైవర్‌కు సంవత్సరానికి రూ. 12 వేల చొప్పున ఇస్తానని చెప్పిన హామీని పూర్తిగా మర్చిపోయారని అన్నారు. రాష్ట్రంలో ఎంత మంది ఆటో డ్రైవర్లు ఉన్నారో వారందరినీ గుర్తించి రూ. 12 వేల సాయం అందించే పథకాన్ని వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లకు రాష్ట్ర ప్రభుత్వం ఒక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. ఆ బోర్డు ద్వారా ఆటో డ్రైవర్ల సంక్షేమానికి ఉచిత ఆరోగ్య బీమా, ప్రమాద బీమా పాలసీ కింద రూ. 10 లక్షల వరకు ఇవ్వాలని కోరారు. ఆటో డ్రైవర్లు ప్రమాదవశత్తూ మరణిస్తే రూ. 6 లక్షల పరిహారం ఇవ్వాలన్నారు. 50 సంవత్సరాలు నిండిన ఆటో డ్రైవర్లకు పెన్షన్ రూ. 5 వేలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 2019 మోటారు వాహన చట్టాన్ని రద్దు చేయాలని అన్నారు. అక్రమంగా తిరుగుతున్న ఓలా, ఉబెర్, ర్యాపిడో లాంటి ఆటోలను వెంటనే రద్దు చేయాలని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆటో క్యాబ్ మోటార్ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా అధ్యక్షుడు నర్సిరెడ్డి, ప్రధాన కార్యదర్శి చందు, అంజి, మహేష్, నిరంజన్, లక్ష్మారెడ్డి, బాల్‌రాజ్, రవీందర్‌రెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిత

ఎంజీఐటీ ప్రిన్సిపాల్ చంద్రమోహన్‌రెడ్డి



ఎంజీఐటీ విశేషాలను తెలుసుకున్న నవోదయ విద్యార్థినులు

మణికొండ: ఉన్నత విద్య చదువుకున్నపుడే జీవితంలో ఉన్నత స్థానంలో ఉండి తమ కలలను సాకారం చేసుకునే అవకాశం ఉంటుందని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీఐటీ) ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. నవోదయ విద్యాలయ సమితి మహబూబ్‌నగర్ జిల్లా విద్యార్థులు గురువారం గండిపేటలోని ఎంజీఐటీ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా వారికి కళాశాలలోని అన్ని ల్యాబ్‌లు, తరగతి గదులు, కళాశాల నిర్వహణ తదితర అంశాలను వివరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ... ఆశయం ఉన్నతమైతే ఆలోచనలు ఉన్నతమై లక్ష్యసిద్ధి నెరవేతుందని, కింది స్థాయి నుంచి మన దేశ రాష్ట్రపతి వరకు ఎదిగిన అబ్దుల్ కలాం జీవిత విశేషాలను వారికి వివరించారు. ఉన్నత విద్య పట్ల మమకారం పెంచుకుని వాటిని సాధించేందుకు పోటీ పడాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ బాల్‌రెడ్డి, అధ్యాపకులు డాక్టర్ ఎం.రవిచందర్, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.